ఆ దేశాలకే పతకాలు ఎందుకని?

చాలా సందర్భాల్లో ఆతిథ్య దేశానికే ఎక్కువ పతకాలు రావడాన్ని మనం గమనించవచ్చు. ఒలింపిక్స్ కోసం నిధులను ఒక్కసారిగా పెంచడం, అలవాటైన వాతావరణం, ప్రోత్సహించే ప్రేక్షకులు... లాంటి కారణాలన్నీ ఇందుకు దోహదపడతాయని చెబుతారు. పైగా ఒలింపిక్స్‌లో ఏదన్నా కొత్త ఆటను చేర్చే విషయంలో ఆతిథ్య దేశపు సూచన కీలకంగా మారుతుంది. సహజంగానే తమకు అనువైన క్రీడలను ఆయా దేశాలు ఎంచుకుని పతకాలు దండుకుంటాయి. ఇక చైనా, అమెరికా, రష్యా లాంటి కొన్ని దేశాలు ఎప్పుడూ పతకాల పట్టికలో ముందుండేందుకు కూడా స్పష్టమైన కారణాలు ఉన్నాయి. జనాభా ఎక్కువ ఉన్నంత మాత్రాన ఒక దేశానికి అధిక పతకాలు వస్తాయని నిర్ధారించలేం. ఒక ఆటను ప్రొఫెషనల్‌గా ఆడాలంటే అందుకు విద్యావ్యవస్థ సహకరించాలి, ప్రభుత్వం తరపు నుంచి ఆధునిక శిక్షణ రావాలి, క్రీడా సౌకర్యాలు అందుబాటులో ఉండాలి... వీటిని అందుబాటులోకి తెచ్చే రోడ్లు లాంటి మౌలిక వసతులు ఉండాలి. నిలదొక్కుకునే వరకు ఖర్చులు భరించేందుకు ఇంటివాళ్లో, స్పాన్సర్సో సిద్ధపడాలి. ఈ పరిస్థితులను మన దేశానికి అన్వయిస్తే, విషయం అర్థమవుతుంది. అన్నట్టు మన ఇంట్లో ఎవరన్నా ఒక పిల్లవాడు హాకీ ఆడతానని ఉబలాట పడితే మనం ఏం చేస్తాం! తను ఎదుగుతున్న కొద్దీ స్కూల్ నుంచి అధికారుల నుంచి ఎలాంటి సహకారం లభిస్తుంది? ఈ ఒక్క ప్రశ్న వేసుకుంటే స్పష్టమైన జవాబులే వినిపిస్తాయి.

1 ఒలింపిక్స్‌కి కూడా ఓ మోటో ఉంది. అదే సిటియ్, అల్టియస్, ఫోర్టియస్!

2 మరింత వేగంగా, మరింత ఎత్తుకు, మరింత దృఢంగా! అన్నది వీటి అర్థం.

3 ఒలింపిక్స్ గుర్తులో ఉండే ఐదు వలయాలు, అయిదు ఖండాలకు ప్రతీక అని తెలిసిందే! మరి ఆ అయిదు రంగులే ఎందుకు అంటే... ప్రపంచంలోని ప్రతీ దేశానికీ ఉండే జెండాలో తప్పనిసరిగా ఈ అయిదు రంగులలో ఒకటి తప్పకుండా కనిపిస్తుంది కాబట్టి!

4 ప్రాచీన ఒలింపిక్స్‌లో క్రీడలు జరుగుతున్నంత సేపు జ్యోతి వెలుగుతూనే ఉండేది. దానికి ప్రతీకగానే ఇప్పటికీ ఒలింపిక్స్ ముందు నుంచే జ్యోతిని వెలిగిస్తారు.

5 హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ ఆటలో ఏకంగా వెయ్యి గోల్స్ చేశారు. ఇది విన్న క్రికెటర్ డాన్ బ్రాడ్‌మన్ 'అవి హాకీ స్టిక్‌తో కొట్టాడా లేక క్రికెట్ బ్యాట్‌తోనా!' అని ఆశ్చర్యపోయాడు. హిట్లర్ అయితే 'నువ్వు మా దేశంలో పుట్టి ఉంటే నిన్ను తక్కువలో తక్కువ మేజర్ జనరల్‌గా చేసేవాడిని' అన్నారు. ధ్యాన్‌చంద్ కొడుకు అశోక్ కుమార్, తమ్ముడు రూప్ సింగ్ కూడా ఒలింపిక్స్ పతకాలను అందుకున్న హాకీ ఆటగాళ్లని చాలామందికి తెలియదు.

6 ఈసారి ఒలింపిక్స్‌లో రష్యా, బెలారస్ దేశాలు పాల్గొనకుండా నిషేధం విధించారు. ఉక్రెయిన్ ఆక్రమణకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ఒలింపిక్ సమాఖ్య ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఆ దేశాల క్రీడాకారులు తమ దేశ చిహ్నాలతో కాకుండా Individual Neutral Athletes పేరుతో పాల్గొనే అవకాశాన్ని కల్పించింది.

7 2016 నుంచి వేర్వేరు దేశాల శరణార్థులు పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నది ఒలింపిక్స్. దీనికి Refugee Olympic Team అని పేరు. ఒలింపిక్స్ జెండానే వీరి జాతీయ జెండా, ఒలింపిక్స్ గీతమే వీరి జాతీయ గీతంగా ఉంటుంది.